

ప్లాస్టిక్ కవర్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రావు, అక్లక్ హుస్సేన్ తదితరులు

జంతు వ్యర్థాలను రోడ్లపై వేయొద్దు

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జంతువుల కళేబరాలు, వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వైశ్రీనివాస్‌రావు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని భోలక్‌పూర్‌లో ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ బ్యాగులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రతీ వీధిలో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిందని, ప్రజలు రోడ్లపై చెత్తాచెదారం జంతువుల వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు వహించాలి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ నాయకుడు అక్లక్ హుస్సేన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, మైనార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి జబ్బార్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చకుండా నాలా ప్రహరీ నిర్మించాలి

● ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి రాధాకృష్ణన్

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లను కూల్చకుండా హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ నిర్మించాలని ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. ఆదివారం దామోదర సంజీవయ్య నగర్‌లో ఎస్‌బీఐ కాలనీ వాసులు అత్యవసర సమావేశాన్ని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ గతంలో ఉన్న మాదిరిగానే హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీని నిర్మించాలని కోరారు. అధికారులు అనాలోచిత నిర్ణయాలతో నాలా ప్రహరీ నిర్మాణం పేరిట తమ ఇళ్లను కూల్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో మాదిరిగానే ప్రహరీ నిర్మిస్తే తమ ఇళ్లకు నష్టం వాటిల్లదని పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల దాదాపు 30 ఇళ్లకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. గతంలో మాజీ మంత్రి కేటీఆర్, అప్పటి ఎమ్మెల్యే ముఠా గోపాల్ తమ ప్రాంతంలో పర్యటించి ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అందుకు విరుద్ధంగా అధికారులు ఇళ్లను ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నాలా ప్రహరీ ఉన్న విధంగానే నిర్మించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ కాలనీ నాయకులు శంకర్‌గౌడ్, లక్ష్మణ్, వెంకట్ ప్రసాద్, శ్రీనివాస్, రంగనాథ్, శివ, చైతన్య, విష్ణుకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ట్రిబ్యునల్‌లో సీనియర్ న్యాయవాదులను సభ్యులుగా నియమించాలి: గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ , జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయబోతున్న రెవెన్యూ ట్రిబ్యునల్‌లో సీనియర్ న్యాయవాదులను సభ్యులుగా నియమించాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కవాడిగూడలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటుచేయడం వల్ల భూవివాదాలలో జాప్యం జరగకుండా త్వరగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

లాభాపేక్ష లేకుండా సేవచేస్తే అవార్డులు

● బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు

చిక్కడపల్లి, జూన్16(ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా సేవచేస్తే అవార్డులు వాటంతట అవే వస్తాయని బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ సత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో సామాజిక చైతన్యమూర్తుల పేరిట సినీనటులు, కళాకారులు, సాహితీకారులకు ఆత్మీయ పురస్కారాల ప్రదాన సభ సంస్థ నిర్వాహకులు ఓంకార్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణమోహనరావు మాట్లాడుతూ అవార్డులు పొందినవారు పొంగిపోకుండా బాధ్యత పెరిగిందని భావించి సమాజానికి మరిన్నిసేవలు అందించాలన్నారున. సమాజాన్ని ప్రభావితం చేసేవి కళలు అన్నారు. టీపీసీసీవర్కింగ్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సత్యసంగీత వంటి సామాజిక సేవా దృక్పథంఉన్న సంస్థలు ఇతరులకుఆదర్శంగా వుంటాయని అభినందించారు. పురస్కారాలనుఅందుకున్నవారిలో శ్రీమణి, కొత్తకొండకృష్ణ, హనుమంతరాయశర్మ, గిడుగుకాంతికృష్ణ, నటులుపూజిత, శైలజ, లక్ష్మీవర్మతదితరులున్నారు. సంస్థ స్థాపకులు ఓంకార్‌రాజు స్వాగతంపలుకగా గాయనీగాయకులు ఉద్యమప్రబోధచైతన్యగీతాలుఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు.

రక్తదాన ఆవశ్యకతను తెలిపిన రన్

● అపోలో ఆస్పత్రి, టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ



రన్‌ను ప్రారంభిస్తున్న తేజస్వీరావు తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో కలిసి 'వాక్.డొనేట్.రిపీట్' అనే లక్ష్యంతో మూడు కిలోమీటర్ల రన్‌ను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వద్ద ఆదివారం నిర్వహించారు. రక్తదానం ప్రాముఖ్యత, అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంగా ఈ వాక్‌ను నిర్వహించామని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దాదాపు 1500 మంది టీసీఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానంపై తమకున్న నిబద్ధతను చాటారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రులు(తెలంగాణ రీజియన్) సీఈఓ తేజస్వీరావు, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్(తెలంగాణ రీజియన్) డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని తాము చేపట్టిన ఈ వాక్‌కు టీసీఎస్ సహకారం అందించడం హర్షణీయమన్నారు. అనంతరం టీసీఎస్ రీజినల్ హెడ్ చల్ల నాగ్, హెడ్ ఆఫ్ టీసీఎస్ హైదరాబాద్ హెచ్‌ఆర్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ అపోలో సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం వల్ల ఒక యూనిట్ బ్లడ్ ముగ్గురి జీవితాల్లో వెలుగులను నింపుతుందని డాక్టర్ సుధారంగనాథన్ అన్నారు.

రూ.2 లక్షలు పలికిన పంజాబ్ పొట్టేలు

● జోరుగా పొట్టేళ్లు, మేకల విక్రయాలు

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో జోరుగా పొట్టేళ్లు, మేకల విక్రయాలు జరిగాయి. ఆదివారం కరీంనగర్, వరంగల్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, మహారాష్ట్రా తదితర ప్రాంతాల నుంచి పలువురు పొట్టేళ్లు తీసుకవచ్చి ముషీరాబాద్ ఏక్‌మినార్, పఠాన్‌బస్తీ, భోలక్‌పూర్, బడీమసీద్ తదితర ప్రాంతాల్లో విక్రయించారు. 10 కిలోల బరువు ఉన్న మేకను దాదాపు రూ.14వేలకు పైగానే విక్రయించారు.

బక్రీద్ పండుగ సందర్భంగా వ్యాపారులు కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్‌కు చెందిన పొట్టేళ్లను తీసుకొచ్చి విక్రయించారు. కొమ్ములు తిరిగి భారీ ఆకారంలో ఉన్న పొటేళ్లు అందరినీ ఆకట్టుకున్నాయి.



ముషీరాబాద్‌లో మేకలు, పొట్టేళ్ల అమ్మకాలు



పంజాబ్ పొట్టేలు

ముషీరాబాద్‌లోని ఏక్‌మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ రహీం(భాషా) పంజాబ్ నుంచి పొటేల్‌ను తీసుకువచ్చాడు. రెండున్నరేళ్లు ఉన్న పొట్టేలు నాలుగు అడుగుల ఎత్తుతో, బరువు 160 కిలోల బరువు ఉంది. దానిని రూ. 2 లక్షలకు విక్రయించారు. షేర్ అలీ వీధికి చెందిన షేక్‌మన్నన్ కర్ణాటక నుంచి తీసుకువచ్చిన 11 నెలల పొట్టేకు 4 అడుగుల ఎత్తు, 98 కేజీల బరువుతో ఉంది. దీని ధర రూ.87వేలు పలికింది. మహారాష్ట్రకు చెందిన పొటేళు బరువు 75 కిలోలు, సంవత్సరంన్నర వయస్సు 3 అడుగుల ఎత్తు ఉన్న పొట్టేలు ధర రూ. 50 వేలు పలికింది.

ధరలు బాగా పెరిగాయి



గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది పొట్టేళ్లు మేకల ధరలు బాగా పెరిగాయి. ఒక్క మేక ధర 14వేలకు విక్రయిస్తున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా రెండు మేకలను కొనుగోలు చేశా

- సయ్యద్ అహ్మద్ భక్తియార్, ముషీరాబాద్ నివాసి

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ లక్ష్మీకాంతరెడ్డి



బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ పి.లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. ఆదివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలని సీఐ వారికి సూచించారు. పీఎస్ పరిధిలోని అన్నిప్రాంతాల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు నరేష్‌కుమార్, కె సుభాష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా సంక్షోభంలో విద్యారంగం: ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వి.పి. సాను

బీజేపీ విధానాలతో సర్వనాశనం: జాతీయ అధ్యక్షుడు సాను

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని, కేంద్రంలోని బీజేపీ విధానాలతో విద్యారంగం సర్వ నాశనమవుతుందని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను ఆరోపించారు. కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎన్టీఏ సంస్థ నిర్వహించే నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు, నిర్వహణ వైఫల్యాలు బహిర్గతమయ్యాయని విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత విద్యార్థి పరిషత్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్. మూర్తి, ఉపాధ్యక్షుడు బి.శంకర్, సహాయ కార్యదర్శి బి. వీరభద్రం, సభ్యురాలు రమ్యల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీపీ సాను మాట్లాడుతూ ఎన్టీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్‌ను లక్షల రూపాయలకు కొందరు అమ్మినట్లు ఆరోపణలు వచ్చాయని అన్నారు. కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశాలను, కేంద్రం పూర్తిగా రాష్ట్రాల హక్కులను లాగేసుకుని విద్యపై పూర్తి నియంత్రణ చేస్తుందని ధ్వజమెత్తారు. ఇది పూర్తి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, ఉపాధ్యక్షుడు రజనీకాంత్, మమత, కిరణ్, వీరభద్రం, అశోక్‌రెడ్డి, సంతోష్‌రాథోడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం భూమి పంచాలి



మాట్లాడుతున్న వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూమిలేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి పంచాలని వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా.జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ(బొజ్జాతారకం) ఆధ్వర్యంలో ఆ పార్టీ కో-ఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన 'భూమిని పంచు, బడ్జెట్ పెంచు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగించారు. తెలంగాణలో అనేక దశాబ్దాలుగా భూమికోసం పోరాటాలు జరిగాయని భూసంస్కరణ చట్టాలు రావడంతో మిగులు భూములు ఏర్పడ్డాయని అన్నారు. తెలంగాణలో నాలుగులక్షల ఎకరాల మిగులు భూములుఉన్నాయని, వాటిని గత కేసీఆర్ ప్రభుత్వం వేలం వేసి అమ్ముకుందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఓడించి రేవంత్‌రెడ్డికి అధికారాన్ని అప్పగించారని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా ప్రభుత్వ భూములను వేలం వేస్తుందని విమర్శించారు. పట్టణ, గ్రామీణ గరిష్ట భూపరిమితి చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమిని ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని, వెంటనే హామీని అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ భూమి, ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే అధికారం,, పేదవర్గాలకు రావాలనిఅన్నారు. బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 90 శాతంగా ఉన్న బహుజన వర్గాలు ఐక్యంగా రాజ్యాధికారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సాంబయ్య, రమేష్, కుమార్‌గాడ్గె, శ్రీరాములపైడి, దాసరి రాజు, రజిత, శారద, సాహిదా, సాంబలక్ష్మి, సమ్మక్క, విజయ, మానాల, రమేష్‌చంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న బైక్ రేసింగ్స్

● పలువురిపై కేసు నమోదు.. బైక్‌లు సీజ్



బైక్‌రేస్‌లతో హల్‌చల్

రాయదుర్గం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో ఆకతాయిలు నిర్వహించే బైక్ స్టంట్స్, కట్స్, బైక్‌రైడ్‌లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రాయదుర్గం ఐటీ కారిడార్‌లోని టీహబ్ పరిసర ప్రాంత రహదారులపై బైక్ రైడర్లు గుంపులుగుంపులుగా వచ్చి ప్రజలు తిరుగుతున్న సమయంలోనే బైక్‌స్టంట్స్, రేసింగ్‌లు చేస్తూ హడలెత్తిస్తున్నారు. 15 రోజుల క్రితం రాయదుర్గం పోలీసులు రాత్రి సమయంలో బైక్‌రేసింగ్ చేస్తున్న సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ఆకతాయిలు డోంట్‌కేర్ అంటూ మళ్లీ బైక్ రేస్‌లు, స్టంట్‌లు చేస్తూ రోడ్డుపై వెళ్తున్న ప్రజలను హడలెత్తిస్తున్నారు. శనివారం రాత్రి రోడ్డు సందడిగా ఉన్న సమయంలోనే రెచ్చిపోయారు. బైక్‌టైర్లపై పెట్రోల్‌పోసి మంటలు అంటిస్తూ రేసింగ్‌లు నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురు బైక్‌రైడర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అలాగే, బంజారాహిల్స్ తాజ్ హోటల్ వద్ద బైక్‌పై వెళ్తున్న సీనియర్ జర్నలిస్టును అతివేగంతో దూసుకెళ్లిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో కాలు విరిగింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బైక్‌రేస్‌లు, స్టంట్స్ చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూర రాజన్న బహిరంగ క్షమాపణ చెప్పాలి

● చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రభాకర్

నల్లకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిలోయ ప్రతిఘటన పోరాటంలో నిరాయుధులైన విప్లవకారులపై కొనసాగించిన నరహంతక హత్యా రాజకీయాలు, తప్పిదాలపై జనశక్తి కూర రాజన్న నేడైనా నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకుని క్షమాపణ చెప్పాలని సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విప్లవోద్యమాన్ని పెడధోరణి పట్టించి, బలహీనపడడానికి కారకుడు కూర రాజన్న అని ఆరోపించారు. ఎం.వి. ప్రసాద్, వసంతక్కల 19వ వర్థంతి పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 25 వరకు తెలుగు రాష్ట్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ షావలి, చిట్టిబాబు, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఇండియన్ నేషనల్ యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు క్రాంతికుమార్

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ నేషనల్ యువజనపార్టీ జాతీయ అధ్యక్షుడు క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రజా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ, నీట్ స్కామ్‌పై ఎవరూ నోరు మెదపడం లేదని దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల వద్ద ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటుచేయాలన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్సీ ఆర్‌ఈటీ గైడ్‌లైన్స్‌ను అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్ష, జాతీయ కోశాధికారి పి. ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి కునాలి యాదవ్, కార్యవర్గ సభ్యులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిశాఖల్లో ప్రమోషన్ ప్రక్రియ చేపట్టాలి

● తెలంగాణ వ్యవసాయశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. వైద్యనాథ్

రాంనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్నిశాఖల్లో ప్రమోషన్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ వ్యవసాయశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. వైద్యనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. వైద్యనాథ్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించినటువంటి అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా జీవోనెంబర్ 317సమస్యలను పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులకు వాహన సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు ఏలూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఏవీజీకే ప్రసాద్, కోశాధికారి డా.సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్క్వాష్ సెమీస్‌లో వేదాంత్, ఆర్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎస్ఎండీసీ తెలంగాణ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా జరుగుతోంది. ఆదివారం జరిగిన పురుషుల క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ వేదాంత్ పటేల్ ఘన విజయం సాధించాడు. అతడితోపాటు ఆర్య, అర్నా ద్వివేది, తనూజ్‌రెడ్డి, ధ్రుతి, తమ విభాగాల్లో సెమీస్‌లోకి ప్రవేశించారు.

పేద విద్యార్థులకు చేయూతనందించడమే భారత్ సేవాశ్రమ్ సంఘ్ లక్ష్యం



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఐఏఎస్ అధికారి దేవసేన

కవాడిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనందించడమే లక్ష్యమని భారత్ సేవాశ్రమ్‌సంఘ్ సంస్థ నగర అధ్యక్షుడు స్వామి మునిశ్వారనంద పేర్కొన్నారు. ఆదివారం ఆశ్రమంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలియా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి దేవసేన ముఖ్య అతిథిగా పాల్గొని 150మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారని అన్నారు. ప్రతియేటా ప్రభుత్వ పాఠశాలలతోపాటు అనాథాశ్రమాలు. వృద్ధాశ్రమాలతోపాటు వరద బాధితులకు సంస్థ తరపున సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భారత్ సేవాశ్రమ్ సంఘ్ ప్రధాన కార్యదర్శి స్వామి వెంకటేశ్వరనంద మహరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ జి విశ్వనాథం గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి :హరినాథ్‌రెడ్డి

నల్లకుంట: పేద విద్యార్థులకు సేవచేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లకుంట డివిజన్‌లోని నర్సింహబస్తీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథ్‌రెడ్డి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జీబీ. శ్యామ్‌రావు, ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, నాయకులు ఎన్. అజయ్‌కుమార్, దేవిరెడ్డి విజితారెడ్డి, సీ. హెచ్. మురళీకృష్ణ, శ్రావణ్, ఎడ్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వీహెచ్

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ వి. హనుమంతరావు జన్మదిన వేడుకలు ఆదివారం బాగ్‌అంబర్‌పేటలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ జరిగింది. హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీతోపాటు పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్‌రాజ్‌గౌడ్‌కు మహానంది అవార్డు బహూకరిస్తున్న పల్లె లక్ష్మణ్‌గౌడ్ తదితరులు

వంగాలకు మహానంది అవార్డు ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సామాజికసేవలో భాగంగా వివాహ సంబంధాలు కుదిర్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆదర్శ స్వచ్ఛంద సంస్థ అధినేత వంగాల బాల్‌రాజ్‌గౌడ్‌కు మహానంది అవార్డు బహూకరించారు. అఖిలభారత మ్యారేజ్‌బ్యూరో జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అవార్డును బహూకరించారు. నిర్వాహకులు బుర్రా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించాలి

చిక్కడపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు కార్పొరేషన్‌కు ఛైర్మన్, డైరెక్టర్లను నియమించాలని తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం కోరారు. ఆదివారం ఆయన చిక్కడపల్లిలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. దాదాపు 60 లక్షల జనాభా ఉన్న మున్నూరుకాపుల సంక్షేమం, అభివృద్ధి దృష్ట్యా కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కేటాయింపులో తమ సంఘం సభ్యులను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం ప్రధానకార్యదర్శులు మహేందర్, రాజేష్‌కుమార్, నిఖిల్, అభిషేక్, అశోక్, జంగిల్ నిఖిల్, రాజకుమార్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏ సూర్యప్రకాష్ సింగ్ తదితరులు

23 నుంచి సింధూ దర్శన్‌యాత్ర

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరినీ ఏకం చేయడమే లక్ష్యంగా ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు సింధూ దర్శన్ యాత్ర నిర్వహిస్తున్నట్లు హిమాలయ పరివార్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాష్‌సింగ్ తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని లేలడక్‌లోని సింధూ నది పరీవాహక ప్రాంతంలో ఈ సింధూ దర్శన్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం బర్కత్‌పురాలోని హిమాలయ పరివార్ సంస్థ కార్యాలయంలో యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సూర్యప్రకాష్ సింగ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న నగరం నుంచి యాత్రకుబయలు దేరుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో హిమాలయ పరివార్ సంస్థ ప్రతినిధులు పెరిక శ్రీనివాస్,జె వేణుగోపాల్‌రెడ్డి, సత్యేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

19న నగరానికి కేంద్ర మంత్రులు

స్వాగత ఏర్పాట్లలో బీజేపీ నాయకులు

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రెండు మంత్రి పదవులు ఇవ్వడం సంతోషకరమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురాలోని నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న నగరానికి వస్తున్న కేంద్రమంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఘనస్వాగతం పలకనున్నట్లు ఆయన చెప్పారు. బేగంపేట ఏయిర్‌పోర్టు నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీమంత్రి సి కృష్ణయాదవ్, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, జి. ఆనంద్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, నందకిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ నుంచి హిమాయత్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలి

చిక్కడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తా నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పదిహేను ఏళ్లుగా రోడ్డును విస్తరించాలని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. గతంలో అప్పటి మంత్రి కేటీఆర్ రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచనలు కూడా చేశారు. ఇరుకుగా ఉన్న రోడ్డులో ఎదురెదురుగా రెండు బస్సులు వస్తే వెళ్లలేని పరిస్థితి. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు ప్రయాణించే రోడ్డు ఇరుకిరుకుగా మారడంతో ట్రాఫిక్ ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును వెడల్పు చేయాలని పలువురు కోరుతున్నారు.



వెంకటేశ్వర్లు, శివమ్మనుసన్మానిస్తున్న సంఘం సభ్యులు

యానాదులను ఆదుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యానాదులను ఆదుకోవాలని తెలంగాణ స్టేట్ యానాది వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ ఈ. ఆంజనేయులు అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో ఓ హోటల్‌లో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యానాదుల జాతి ఆణిముత్యాలు రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎకనామిక్స్‌లో పీజీ పూర్తి చేసిన శివమ్మను సత్కరించి అభినందించారు. తెలంగాణాలో యానాదులను ప్రభుత్వం గుర్తించినా సంక్షేమ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందడం లేదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రామచంద్రరావు, రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కవాడిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం బన్సిలాల్‌పేట సీసీనగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఏ. రామకృష్ణ కుమారుడు సుబ్రమణ్యం(18) ఇంటర్మీడియెట్ మధ్యలో ఆపేశాడు. జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లీ, కుటుంబ సభ్యులు తలుపు కొట్టినా తీయక పోవడంతో డోర్‌కు ఉన్న కార్డ్‌బోర్డు బాక్సును తొలగించి లోపలికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కుటుంబసభ్యులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.